# అరెస్టులు..నిర్బంధాలు



**నిర్మల్, మే 28 నవభూమి** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర నుంచి ఆంక్షల పాలన కొనసాగుతున్నది. సర్కారు కార్యక్రమాలు నిర్బంధం నీడనే అమలవుతున్నాయన్న విమర్శలున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు బుట్టదాఖలవుతుని అధికార పార్టీ నేతలను జనం అడుగడుగునా నిలదీస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల తమ సమస్యలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న ఘ టనలు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ మే కొనుగోలు చేయాలంటూ రైతాంగం ఆందోళనలను ఉధృతం చేసింది. ఇందులో భాగంగానే కడెం మండలంలోని లింగాపూర్‌లో అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకున్నది.ఏకంగా వారు అధికార పార్టీ ఎమ్మెల్యే బొజ్జును నడిరోడ్డుపై అడ్డుకుని నిలదీశారు. పంట కొనుగోళ్లతోపాటు ఇతర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ దుమ్మెత్తి పోశారు. ఎమ్మెల్యేతో దా దాపు గంటకుపైగా రైతులే కాకుండా సాధారణ ప్రజలు వాగ్వాదానికి దిగడం సర్కారుపై వెల్లువెత్తుతున్న అసంతృప్తికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటన కూడా ఆద్యంతం ఆంక్షల మధ్యే కొనసాగడం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. సీతక్క పర్యటన సందర్భంగా రైతులతోపాటు సాధారణ ప్రజలు కూడా ఆందోళనలు చే సే అవకాశం ఉండడంతో అధికార పార్టీ నేతలు పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి నిర్బంధాన్ని కొనసాగించారు.సోమవారం రాత్రి నుంచే నిర్మల్‌తోపాటు ముథోల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అలాగే మరికొంత మందిని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్తలు విలాస్ గాదేవార్, పడకంటి రమాదేవితోపాటు పలువురు నాయకులను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంత్రి కార్యక్రమాలు జరిగిన లోకేశ్వరం, బ్రహ్మన్‌గావ్‌ల్లో పోలీసు బలగాలను భా రీ సంఖ్యలో మోహరింపజేసి బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా అడ్డుకున్నారు.మాజీ సర్పంచ్‌లపైనా..పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఏడాదిన్నర నుంచి తాజా మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో మంగ ళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చారు. దీంతో నిర్మల్ జిల్లాలో ని మాజీ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు మంగళవారం ఉదయం హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యా రు.ఈ క్రమంలోనే సోమవారం అర్ధరాత్రి నుంచే మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఖానాపూర్, కడెం, లక్ష్మణచాంద మండలాల్లో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ల లో నిర్బంధించారు. పెండింగ్ బిల్లులను ఇవ్వాలని కోరితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడు తున్నదని మాజీ సర్పంచ్‌లు మండిపడుతున్నారు.అప్పులు చేసి లక్షలాది రూపాయలు వెచ్చించి పనులు చేసిన తమను అర్ధరాత్రి 12 గంటలకు దొంగల్లాగా పోలీసు స్టేషన్లకు తరలించారని వాపోతున్నారు. కేసీఆర్ పాలనలో గౌరవంగా బతికామని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖైదీల మాదిరిగా అర్ధరాత్రి అపరాత్రి వచ్చి తమను పోలీసులు స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు మళ్లీ సర్పంచ్‌గా పోటీ చేయమని కొంతమంది మాజీ సర్పంచ్‌లు స్పష్టం చేస్తున్నారు. అలాగే తమకు న్యాయంగా రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించే వరకు గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలను కూడా జరుగనివ్వబోమని హెచ్చరిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం గ్రామాల్లోకి వచ్చే అధికారులను నిర్బంధిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.రైతులపైనే ఫోకస్ నెల రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం రైతులను తీవ్రంగా ఇబ్బందుల పాలు చేస్తున్నప్పటికీ ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం తరఫున తడిసిన ధాన్యం కొనుగోలుపై స్పష్టత రాకపోవడంపై రైతులు అసహనానికి కారణమవుతున్నది. గత రెండు సీజన్లకు సంబంధించి రైతు భరోసా డబ్బులు రాక, రుణమాఫీ జరగక ప్రభుత్వంపై రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రైతుల సమస్యలను పక్కన పెట్టి అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు మంత్రి సీతక్క హాజరవుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. మంత్రిని నిలదీసే అవకాశాలు ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు రైతులను కట్టడి చేశారు. ఇందులో భాగంగానే ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాల పర్వాన్ని కట్టుదిట్టంగా కొనసాగించారు.

## మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హౌస్ అరెస్ట్






# నవభూమి

ఆదిలాబాద్ అనుబంధం

28 మే,2025 బుధవారం పేజీలు 5

www.epaper.navabhoomi.in


# జోరువాన..

## ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షం



**ఆదిలాబాద్, మే 27 నవభూమి:** ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈ దురుగాలులతో కూడిన వర్షం కారణంగా జనం ఇబ్బందులు పడ్డారు. వీధులు జలమయంగా మారాయి. డ్రెయినేజీ వ్య వస్థ అస్తవ్యస్తంగా మారింది. రెండు రోజులుగా ఎండ ప్ర భావం కారణంగా వాతావరణం వేడిగా మారగా.. మం గళవారం కురిసిన వానతో ఒక్కసారిగా చల్లబడింది.ఇచ్చోడ, సిరికొండలో..ఇచ్చోడ, మే 27 నవభూమి ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బోరిగామ వాగు పొర్లింది. ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతులు వ్యవసాయ పనులను మొదలు పెట్టారు. వ్యవసాయ మార్కెట్ కేంద్రాల్లో జొన్న తడవకుండా టార్పాలిన్‌లు కప్పారు.జైనథ్‌లో తడిసిన జొన్న .మండల కేంద్రంలో ని మార్కెట్ యార్డుకు తమ వాహనాల్లో జొన్న పంటను రైతులు తీసుకొచ్చారు. మార్కెట్ యార్డు లో జొన్న పంట భారీ వర్షానికి తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్ర మానసిక ఆం దోళనకు గురవుతున్నారు.భీంపూర్‌లో రోడ్లు బురదమయం.వర్షానికి ఆర్అండ్‌బీ రహదారులు బురదమయంగా మారాయి. ఆదిలాబాద్- కరంజి(టి) 50 కిలోమీటర్ల రోడ్డు ప్రయాణానికి వీలులేకుండా పోయింది. ఆర్టీసీ ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో కోతలు కాని జొన్న పంటకు నష్టం వాటిల్లింది. పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పెన్‌గంగకు నీరు వచ్చి చేరుతున్నది.ఖానాపూర్‌లో తడిసిన ధాన్యం.ఖానాపూర్ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సుభాష్‌నగర్, విద్యానగర్, పాత బస్టాండు మార్కెట్ ఏరియాలో రోడ్లపైకి వర్షపు నీరు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ యార్డులో ధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.తడిసిన ధాన్యం కొనాలి...కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు, వడ్లు ఉండడంతో వీటిని కాపాడుకోవడానికి టార్ఫాలిన్ కవర్లు కప్పారు. తడిసిన ధాన్యాన్ని కొనాలని, తూకం వేసిన ధాన్యాన్ని తరలించాలని రైతులు వేడుకుంటున్నారు.బోథ్‌లో నువ్వుల పంటకు నష్టం.బోథ్ మండలంలో సుమారు రెండు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దుక్కులు దున్నిన పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. మరో వైపు కోత దశలో ఉన్న నువ్వు పంటకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. మార్కెట్ యార్డుకు జొన్నలు అమ్మడానికి తీసుకెళ్లిన రైతులు తడవకుండా ఉండేందుకు అవస్థలు పడ్డారు. టార్పాలిన్‌లు కప్పారు. మరో వైపు బోథ్ వారసంతలో వర్షం మూలంగా కూరగాయలు, ఇతర వస్తువులు తడిసి ముద్దయ్యాయి.ఇంద్రవెల్లి మండలంలో ఆలయంపై పిడుగు.మండలంలోని పోల్లుగూడలో జుగ్నాక్ వంశీయుల కుల దేవత పెర్సపేన్(పెద్దదేవుడు) ఆలయంపై పిడుగు పడడంతో ఆలయ గోపురం పలిగిపోయి, కలశం ఊడిపోయిందని గ్రామస్తులు జుగ్నాక్ భరత్, కాశీరాం, మానిక్‌రావ్‌లు తెలిపారు. మామిడిగూడ, హీరాపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి. దీంతో గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు ఇబ్బంది పడుతున్నారు.

# ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల



**బాసర, మే 28 -నవభూమి:** బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్‌ను బుధవారం వైస్ చాన్సలర్ గోవర్ధన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. బాసర సెంటర్‌లో 1500ల సీట్లు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 180 సీట్లకు ఆరేండ్ల సమీకృత విద్యావిధానంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి అడ్మిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు.ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పటయిందని, ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. దీంతో ఉపాధి, ఉద్యోగావకాశాలు పేద విద్యార్థులు పొందుతున్నారని అన్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాలను ట్రిపుల్ ఐటీ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో-కన్వీనర్ డాక్టర్ దేవరాజ్, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, మంతపురి హరికృష్ణ పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు నవభూమి జోగు రామన్న



**ఆదిలాబాద్ నవభూమి** జాతీయ రహదారి 363 పై ప్రమాదాలు జరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కారణమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలోని నేషనల్ హైవే 363 రెండేళ్ల పూర్తి కావాల్సి ఉన్న పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని తెలిపారు. జైనథ్ మండలం ధర్మం వద్ద ఇటీవల రూ. 4.5 కోట్లతో నిర్మించిన వంతెన ప్రమాదాలకు కారణం అవుతుందని తెలిపారు.మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జైనథ్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన దత్తు అనే యువకుడు మోటర్ సైకిల్ పై వంతెన దాటుతుండగా గల్లంతయినట్టు తెలిపారు. పాత వంతెన ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడానికి అనుకూలంగా ఉండగా ఇటీవల నేషనల్ హైవే అధికారులు వంతెనను కూల్చివేసినట్టు తెలిపారు. రహదారి నిర్మాణం పనులు పర్యవేక్షణలో అధికారులు విఫలమయ్యారని నాణ్యత లోపించిందని విమర్శించారు.

# వంతెన దాటుతుండగా యువకుడు గల్లంతు?



**ఆదిలాబాద్ నవభూమి** జిల్లాలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. జైనథ్ మండలం ధర్మం వంతెన పొంగి ప్రవహించగా ప్రమాదవశాత్తు ఓ యువకుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. జైనథ్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన లాండ్గే దత్తు (30) ఆదిలాబాద్ నుంచి మోటార్ సైకిల్‌పై తన ఇంటికి వెళ్తుండగా మధ్యలో వంతెన దాటే ప్రయత్నం చేసి అందులో పడిపోయాడు. ఉదయం దత్తు ఇంటికి రాకపోవడంతో బంధువులు వంతెన వద్ద గాలించడంతో ఆయన మోటార్ సైకిల్ లభించింది. వంతెన పరిసర ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హౌస్ అరెస్ట్

## కౌటాలలో భారీగా పోలీసుల మోహరింపు



**కౌటాల, మే 28నవభూమి** కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది ఒడ్డున ప్రాజెక్టు మోసాలపై చర్చకు రావాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సవాల్‌ను స్వీకరించారు. బుధవారం ఉదయం కాగజ్‌నగర్‌లోని ఆయన ఇంటి నుంచి కౌటాల మండలం తుమ్మిడి వద్దకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ పోలీసులు భారీగా మోహరించి కోనప్పను హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తమ్ముడు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు నాయకులతో కలిసి కౌటాల నుంచి తుమ్మిడి హెట్టి వద్దకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సమయంలో కౌటాల సీఐ ముత్యం రమేశ్ అడ్డుకున్నారు.బీజేపీ నాయకులు ప్రాణహిత వద్దకు ఎలా వెళ్తారని కృష్ణారావు ప్రశ్నించగా.. ఎవరిని కూడా అక్కడికి వెళ్లనివ్వమని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని సీఐ కోనేరు కృష్ణారావుకు వివరించడంతో ఆయన వెనుతిరిగి కౌటాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్ పార్టీ కార్యకర్తలతో కలిసి తుమ్మిడి హెటి వద్ద గల ప్రాణహిత నది వద్ద కార్యకర్తలతో చేరుకొని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తామంతా ఇక్కడికి చేరుకున్నామని తెలిపారు. పదేళ్ల పాలనలో మాజీ ఎమ్మెల్యే కోనప్ప ప్రాజెక్టు విషయంలో చేసింది ఏమి లేదని విమర్శించారు. బహిరంగ చర్చకు ఎమ్మెల్యే హరీశ్ బాబు సిద్ధంగా ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుకోవడంతో ఇక్కడికి రాలేకపోయారన్నారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న కోనప్ప కార్యకర్తలు ఎమ్మెల్యే హరీశ్ బాబు వ్యాఖ్యలపై తీవ్రంగా ఖండిస్తూ ప్రాణహిత నదిపై బహిరంగ చర్చకు మాజీ ఎమ్మెల్యే కోనప్ప రానవసరం లేదని తాము దేనికైనా సమాధానం ఇచ్చే అంత ధైర్యం మా దగ్గర ఉందని దమ్ముంటే ఎమ్మెల్యే హరీశ్ బాబు రావాలని సవాల్ విసిరారు.అనంతరం మండల కేంద్రంలోని కోనప్ప నివాసంలో సమావేశం ఏర్పాటు చేసి తాజా ఎమ్మెల్యే హరీశ్ బాబు ఏడాదిన్నర పాలనలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయకపోగా నిత్యం ప్రజల కోసం సేవ చేసే, ప్రజల మధ్యలో ఉండే కోనేరు కోనప్ప అతని కుటుంబాన్ని విమర్శించే స్థాయి హరీష్ బాబుది కాదని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమరం మాంతయ్య అన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మండల కేంద్రంలో ఇటు కోనప్ప మద్దతుదారులు, అటు బీజేపీ కార్యకర్తలు బయటకు రావడంతో ఇరు వర్గాలు ఎదురు పడకుండా కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అభివృద్ధికి పెద్ద పీట



**ముధోల్-నవభూమి:** ముధోల్ ప్రాంత అభివృద్ధికి పెద్ద పీట వేస్తానని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అన్నారు. ముధోల్ మండలంలోని బ్రాహ్మణ్ గావ్ గ్రామంలో పంచాయతి కార్యాలయ భవనాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. అలాగే సుమారు 20కోట్లతో వివిధ అభివృద్ధి పనులను మంత్రి శంకుస్థాపన చేశారు. పంచాయతీ కార్యాలయంలో స్టీల్ బ్యాంకు ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత పాలకుల హయాంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కు అన్యాయం జరిగిందని అన్నారు. జిల్లా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బ్రహ్మణ్ గావ్ లిఫ్ట్ ఇరిగేషన్ కు త్వరలో నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. సిసి రోడ్లు నాణ్యత గా చేస్తే ప్రజలకు ఉపయోగపడతాయన్నారు. అర్హులకు ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధికి అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని పలువురికి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వేద్మ బొజ్జు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్, ఆడిషనల్ కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, ఎస్పీ జానకి షర్మిల,మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, తెలంగాణ జన సమితి ముధోల్ ఇంచార్జి సర్దార్ వినోద్ కుమార్,మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు సురేందర్ రెడ్డి, అఫ్రోజ్ ఖాన్,కోరి పోతన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పర్యటనపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

**ముధోల్-నవభూమి:** ముధోల్ నియోజకవర్గంలో మంగళవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క పర్యటన ఉండడంతో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల బందోబస్తు స్వయంగా పరిశీలించారు. ముధోల్ మండలంలోని బ్రహ్మణ్ గావు గ్రామంలో మంత్రి పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన నేపథ్యంలో ముందుగా గ్రామానికి కురుస్తున్న వర్షంలో ఎస్పీ వచ్చారు. బందోబస్తు వివరాలను ముధోల్ సిఐ మల్లేష్ ఎస్సై సంజీవ్ ను అడిగి తెలుసుకున్నారు. వర్షంలోనే బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.మంత్రి పర్యటనలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎస్పి సూచించారు. ఇటీవల మంత్రి పొంగులేటి కార్యక్రమం సందర్భంగా కుంటాల మండలంలో అక్కడ బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. దీంతో ఇలాంటి సంఘటనలను మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా ఇంచార్జి మంత్రి పర్యటనలో భాగంగా జిల్లా ఎస్పీ ముందస్తు చర్యలు తీసుకున్నారు . బందోబస్తులో భాగంగా మంత్రి వచ్చే రూట్లల్లో ఆయా గ్రామాల వద్ద ముందుగానే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ బిజెపి కార్యకర్తలను మంగళవారం ఉదయం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఆనంతరం వారిని సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు. మంత్రి పర్యటన సజావుసాగడంతో పోలీసులు ఊపిరి పిలుచుకున్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి నవభూమి కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ నవభూమి:** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ఏ విధమైన ఆస్తి నష్టం కలగకుండా అధికారులు హెడ్ క్వార్టర్ లోనే ఉండి పర్యవేక్షించాలని తెలిపారు. వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వర్షాల వలన వరదలు, వంకలు ఉప్పొంగిపోతే రోడ్లు, వంతెనలు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.నాలాలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు వర్షాలకు నాని కూలిపోయే అవకాశం ఉన్నందున అక్కడ నివసించే వారిని ఖాళీ చేయించాలని, ఐరన్ విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను పూడ్చాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ పొందిన వలంటీర్లను వినియోగించుకోవాలని, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, అత్యవసర పరిస్థితుల్లో 18004251939 కంట్రోల్ నెంబర్ కు కాల్ చేయాలని ప్రజలను జిల్లా కలెక్టర్ కోరారు.

## రైతులను నట్టేట్ట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం నవభూమి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**నెన్నెల నవభూమి** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట్ట ముంచిందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. బుధవారం నెన్నెల మండలంలోని గొల్లపల్లి, మైలారం గ్రామాలలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నెల రోజులుగా రైతులు పంట కోసి వడ్లను కల్లాల్లోనే ఉంచారన్నారు. ఇప్పటి వరకు ఎవరు కొనేవాళ్లు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండి పడ్డారు.గత పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు వర్షం కురిసిందని, దీంతో కల్లాలో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి పోయి మొలకెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లు రైతులను ముంచుతున్నారని, తరుగు తీసుకుంటున్న పట్టించుకునే వారే లేరన్నారు. ఎమ్మెల్యే వినోద్ రైతులను చుసిన పాపం పోలేదన్నారు. మంత్రి పదవి కోసం మాత్రం లెక్కలేనన్ని సార్లు ఢిల్లీకి పోయాడు తప్పా రైతు వద్దకు రాలేదు అన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## వర్షంతో రైతులు ఆందోళన పడవద్దు

**ముధోల్-నవభూమి:** ధాన్యం తడిసిన ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దు అని తహాశీల్దార్ శ్రీలత అన్నారు. ముధోల్ మండలంలోని చించాల, వెంకటాపూర్, ఎడ్ బిడ్, వరి కొనుగోలు కేంద్రాలను గురువారం రోజు తహాశీల్దార్ పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి పలు వివరాలను రైతులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వెంట వెంటనే ధాన్యాన్ని తూకం వేసి లారీలో వెంటనే రైస్ మిల్లుకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఆలస్యం చేయవద్దనిఅని అన్నారు.

# మా భూములు లాక్కోవద్దు



**పెంబి, మే 27 నవభూమి** 45 ఏండ్ల నుంచి పోడు భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, మా భూములను లాక్కోవద్దని రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఇటిక్యాల గ్రామ శివారులో దాదాపు 78 ఎకరాల్లో ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 45 మంది రైతులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఫ్ఆర్వో రమేశ్‌రావు మంగళవారం సిబ్బందితో కలిసి పోడు భూముల్లో మొక్కలు నాటడానికి చర్యలు తీసుకున్నారు.విషయం తెలుసుకున్న రైతులు తమ భూముల్లో మొక్కలు నాటడానికి కందకాలు తవ్వుతుండగా అడ్డుకున్నారు. తవ్విన కందకాల్లో పడుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోడు పట్టాలు ఇవ్వడానికి సర్వే చేశారని, ఇప్పుడు అటవీ అధికారులు భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో రమేశ్‌రావు, డీఆర్వో ప్రతాప్ నాయక్, ఎఫ్‌బీవోలు కిరణ్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.ప్రయత్నాలు మానుకోవాలి..కడెం, మే 27నవభూమి అటవీ అధికారులు అక్రమంగా తమ భూములు లాక్కునే ప్రయత్నాలను మానుకోవాలని రైతులు హెచ్చరించారు. నవాబుపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 110లో మంగళవారం అటవీ అధికారులు కందకాలు తవ్వి బౌండరీలను ఏర్పాటు చేసే విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. ఏళ్ల పోరాటాల ద్వారా తాము భూములను దక్కించుకున్నామని, మాకు పట్టాలు ఉండగా అధికారులు భూములను తిరిగి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.కలెక్టర్, అప్పటి ఎమ్మెల్యే, తహసీల్దార్ ద్వారా మాకు అటవీ హక్కు పట్టాలు ఇచ్చారన్నారు. మా భూములను తిరిగి అధికారులు తీసుకునే ప్రయత్నాలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. దీంతో అధికారులు పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తిరిగి వెళ్లిపోయినట్లు ఎఫ్ఆర్వో గీత తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సిద్ధార్థ పాల్గొన్నారు.

# భారత విద్యార్థులను టార్గెట్ చేస్తున్న ట్రంప్: అశోక్ ఓంకార్




**వరంగల్ మే 25నవభూమి** విదేశీ విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులపై ఆంక్షల పేరుతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశాన్ని తన గుప్పిట్లోకి తీసుకోవడానికి కుట్రలు చేస్తున్నాడని ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. బుధవారం ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సూట్లాడారు. విదేశీ విద్యార్థులపై అమెరికా ఆంక్షలు విధిస్తూ టార్గెట్ చేస్తుందని అన్నారు. ఇతర దేశాల మధ్య ఆ వచ్చిన తగాదాలను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా యుద్ధోన్మాదాన్ని పెంచుతున్నదని విమర్శించారు.తనకు అనుకూలంగా వ్యవహరించని దేశాలపై కక్ష కట్టి ఎగుమతులు, దిగుమతుల విషయంలో పన్ను భారాన్ని మోపి ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నదని మండిపడ్డారు. ట్రంప్ విధానాలను వ్యతిరేఖించాల్సిన మోదీ ప్రభుత్వం మోకాల్లపై మోకరిల్లి దేశానికి, విదేశాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు, దేశ ప్రజలకు తీరని అన్యాయాన్ని చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షణ వైఫల్యాలలను కప్పిపుచ్చుకోవడానికి సాధించని విజయాన్ని సాధించినట్లు ప్రచారం చేసుకుంటుందని అన్నారు. ఉగ్రదాడిని సైతం తన మతోన్మాద ప్రచారానికి మోడీ ప్రభుత్వం వినియోగించుకుందని ఆరోపించారు.రాజకీయాలకు అతీతంగా రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మద్దతు ధర చట్టం తీసుకురావడంతో పాటుగా అమలు జరిపేలా చేయడం, నిత్యావసరాల ధరల తగ్గింపు అంశాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కిరణ్ జిత్ సింగ్ షేకాన్, మహేంద్ర నేహాల్, అనుభవ్ దాక్షిశాస్త్రి, కాటం నాగభూషణం, వల్లేపు ఉపేందర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాడగోని రవి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, కార్యవర్గ సభ్యులు గోని కుమారస్వామి, ఎర్రెడ్డి హంసారెడ్డి, నంది రవి, కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, అప్పరపురి నర్సయ్య, మాలి ప్రభాకర్, మల్లికార్జున్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు సంఘాలతోనే ఆర్థిక ప్రగతి

**భీమదేవరపల్లి, మే 28నవభూమి** సభ్యుల పరస్పర సహకారంతో పొదుపు సంఘాలు ఆర్థిక ప్రగతి సాధిస్తాయని సహా వికాస మేనేజర్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తకొండ బీఆర్కే ఫంక్షన్ హాలులో ముల్కనూరు పురుషుల పొదుపు సమితి -2 పదవ వార్షిక మహాసభ అధ్యక్షులు గాజుల సతీష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు పొదుపు చేసుకున్న నిధులు కష్టకాలంలో వారి కుటుంబాలకు ఆర్థిక చేయూతగా మారుతాయన్నారు. ముల్కనూరు పురుషుల పొదుపు సమితి -2 లో 14 సభ్య సంఘాలు ఉండగా రూ. 5,38,75,850 నియమిత పొదుపులు ఉన్నట్లు చెప్పారు. పొదుపుల నుండి వచ్చిన లాభాన్ని రూ. 4,58,37,563 బోనస్ రూపేణ పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సహావికాస డీఏ సుమలత, డీఏ ఈశ్వర్, ముల్కనూరు పొదుపు సమితి %-% 1 అధ్యక్షులు జాన ప్రవీణ్, డైరెక్టర్ లు అల్లం శ్రీనివాస్, ఎల్ది బొందయ్య, భూక్య సమ్మయ్య, తబొల్లంపెల్లి చిన్న రాములు, భూక్య చంద్రు, బర్రె ప్రతాప రెడ్డి, ఎస్ డీ జబ్బర్, కొలుగూరి మధుకర్, అయిత రవీందర్, నిలిగొండ మల్లయ్య, గుర్రపు కుమారస్వామి, అన్నవేన రాజు, కంకల సదానందం, పిట్టల ఐలయ్య, దుర్శనపల్లి రాజేశ్వర్ రావు, చింత రమేష్, ఆకుల రాజు, షేక్ ఆలీ, వెన్నం లింగారెడ్డి, జేరిపుల రాజు, నిమ్మశెట్టి రాం సృజన్, దాసరి రవీందర్, గణకులు గజ్జెల రవీందర్, కుమారస్వామి, పొదుపు సంఘాల డైరెక్టర్ లు పాల్గొన్నారు. కాగా, వీరభద్ర పురుషుల పొదుపు సమితి అధ్యక్షులుగా గాజుల సతీష్, ఉపాధ్యక్షులుగా ఎల్ది బొందయ్య, ముల్కనూరు పురుషుల పొదుపు సమితి %-% 2 అధ్యక్షులుగా బర్రె ప్రతాప రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొలుగూరి మధుకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



**తాంసి మే 27 నవభూమి** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా నూతన పంచాయతీ అధికారి రమేష్ అన్నారు. నూతన పంచాయతీ అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టగా మంగళవారం తాంసి మండలంలోని హస్నాపూర్, పొన్నారి, కప్పర్ల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను, నర్సరీ,సెగ్రియేషన్ షెడ్,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రికార్డులను పరిశీలించారు.అనంతరం మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు ఎంపీడీవో కార్యలయంలో పూల మొక్కను అందజేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ రెడ్డి, ఎంపివో రామ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు గంగన్న, కార్తిక్, సంధ్య, లావణ్య రెడ్డి, నరేష్, హమీద్, విజయ కనక దుర్గ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన ఎర్రవాగు.. ఆరు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



**నెన్నెల-నవభూమి:** నెన్నెల మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లంబాడి తండా ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రవాగు వద్ద వంతెన నిర్మాణం పనులు ఇటీవల చేపట్టారు. దాని పక్కనే తాత్కాలిక రోడ్ వేసి రాకపోకలు సాగించారు.అయితే భారీ వర్షం పడటం వలన తాత్కాలికంగా వేసిన రోడ్ తెగి పోయింది. దీంతో లంబాడి తండా, కుర్మగూడెం, కోణంపేట, జంగళపేట, ఖర్జీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లపల్లి, మైలరాం, చిత్తపూర్, అవుడం, గంగారాం గ్రామాలలో ధాన్యం కుప్పలు తడిసి పోయాయి. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## మాజీ సర్పంచ్‌ను అభినందిచిన మంత్రి

**ముధోల్-నవభూమి:** గ్రామపంచాయతీ భవనం విశాలమైన స్థలంలో ప్రభుత్వం నిధులతో సకాలంలో నిర్మించినందుకు మాజీ సర్పంచ్ రాంరెడ్డి ని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అభినందించారు. ముధోల్ మండలంలోని బ్రహ్మాన్ గాం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం ను మంత్రి మంగళవారం ప్రారంబించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రేడ్డి మాజీ సర్పంచ్ రాంరెడ్డి ని పరిచయం చేశారు. సర్పంచ్ పదవి అయిపోయినప్పటికి పంచాయతీ కార్యాలయం నిర్మించారని చెప్పారు. దీంతో మాజీ సర్పంచ్ ను మంత్రి  అబినందించారు.



# భూ దందా




**ఆదిలాబాద్, మే 28 నవభూమి:** సొంతింటి కలను నిజం చేసుకుందామనే సామాన్యులకు కొందరు అక్రమార్కుల ధనదాహం కారణంగా నష్టపోవాల్సి వస్తుంది. రియల్ వ్యాపారులతోపాటు భూముల క్రయవిక్రయాలు జరిపే వారు ప్రజల అవకాశాలను ఆసరాగా చేసుకుని అందిన కాడికి దోచుకుంటున్నారు. ఒకే స్థలాన్ని ఇద్దరికి విక్రయించి మోసాలకు పాల్పడుతున్నారు. లక్షల రూపాయల ఖర్చు చేసి కొనుగోలు చేసిన స్థలంలో ఇండ్లు నిర్మించుకునేందుకు కొనుగోలుదారులు ప్రయత్నాలు ప్రారంభిస్తే ఆ జాగా తమదని ఇతరులు రావడంతో గుండెలు బాదుకుంటున్నారు. స్థలం విక్రయించిన వారిని నిలదీస్తే వారు పొంతన లేని సమాధానాలు చెబుతూ భయందోళనలకు గురి చేస్తున్నారు. కొందరు దళారులు వారి వద్ద మరిన్ని పైసలు వసూలు చేసి వేరే స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారు. రెండోసారి కొనుగోలు చేసిన స్థలాలు మొదటగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉండడంతో మోసగాళ్ల చేతిలో పడి నష్టపోతున్నారు. పైసా, పైసా జమ చేసి కొనుగోలు చేసిన స్థలం తమది కాకుండా పోయిందని బాధపడుతూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.ఒకే స్థలాన్ని ఇద్దరికి విక్రయిస్తున్న అక్రమార్కులు మధ్య తరగతి ప్రజలు కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులతో ఇంటి స్థలాలను కొనుగోలు చేస్తారు. పిల్లల చదువులు, ఆరోగ్య సమస్యలు, ఉద్యోగం, ఇతర ఉపాధి పనుల కోసం గ్రామాల నుంచి ప్రజలు పట్టణాలకు వచ్చి స్థిరపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మహారాష్ట్రతోపాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడి వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాలతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. కొందరు దళారులు పట్టాదారులకు అడ్వాన్సుగా కొన్ని డబ్బులు చెల్లించి ప్లాట్లుగా మార్చి అమ్మకాలు జరుపుతున్నారు. కొందరు అక్రమార్కులు ఒకే స్థలాన్ని ఇద్దరు వ్యక్తులకు విక్రయించి మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో సొంతిళ్లు నిర్మించుకుందామని పైసా, పైసా కూడబెట్టి ఇంటి స్థలాలను కొనుగోలు చేసిన వారు మోసపోతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగి లక్ష్మీనారాయణ పాత హౌజింగ్ బోర్డు కాలనీలో ఒకే స్థలాన్ని ఇద్దరి వ్యక్తులకు విక్రయించగా బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా పరిషత్‌లో నాల్గోవ తరగతి ఉద్యోగిగా పనిచేస్తున్న గంగాధర్ అనే వ్యక్తి అటెండర్ కాలనీలో ఓ ప్లాటును నకిలీ పత్రాలకు విక్రయించినందుకు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు.అక్రమాల అడ్డుకట్టకు అవకాశం లేదా..ఒకే స్థలాన్ని ఇద్దరికి విక్రయించకుండా రిజిస్ట్రేషన్ అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఎందుకు ఉండదనే అభిప్రాయాల ను జనం వ్యక్తం చేస్తున్నారు. విక్రయదారులు నకిలీ పత్రాలు సృష్టించి ఒకే ప్లాటును ఇద్దరు వ్యక్తులకు విక్రయిస్తే అమ్మిన వ్యక్తి లక్షలు సంపాదిస్తుండగా కొనుగోలు చేసిన వారు నష్టపోవాల్సి వస్తుంది. ఒకే ప్లాటును ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉం దని విషయాన్ని ఆదిలాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులను అడిగితే తాము పత్రాలు సరిగా చూసి రిజిస్ట్రేషన్ చేస్తామని తమకు మొదటి రిజిస్ట్రేషన్లకు సంబంధం లేదని జాయింట్ రిజిస్ట్రార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఒకే ప్లాటును రెం డు సార్లు రిజిస్ట్రేషన్ చేయకుండా, దళారుల అక్రమాలను అడుక ట్టు వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భారీ వర్షాలకు తెగిన దొడ్ల వాగు తాత్కాలిక రోడ్డు

**ఏటూరునాగారం-నవభూమి:** ఏటూరు నాగారం మండలం దొడ్ల సమీపంలోని జంపన్న వాగుపై తాత్కాలికంగా నిర్మించిన మట్టి రోడ్డు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద ప్రవాహానికి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో మల్యాల, కొండాయి, ఐలాపూర్ గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. జంపన్న వాగుపై నిర్మించిన బ్రిడ్జి గత రెండు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. అప్పటినుంచి వర్షాకాలంలో కొండాయి, మల్యాల, ఐలాపూర్ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా ఈ వాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాగా ఆ రోడ్డు కాస్త మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు తెగిపోయి వరద ప్రవహిస్తోంది. ప్రస్తుతం గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయినట్లే. వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వాగు దాటే పరిస్థితి కనిపించడం లేదు. ఆ గ్రామాల ప్రజలు, గిరిజనులు వైద్యం వ్యవసాయం ఇతర అవసరాల కోసం ఏటూరు నాగారం రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ మార్గం తెగిపోవడంతో



నిత్యవసర సరుకులకు సైతం ఇబ్బంది పడాల్సిందే. ఇదిలా ఉండగా గత ఏడాది ఈ వాగుపై ఐరన్‌తో ఫుట్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రయత్నాలు అధికారులు చేసినప్పటికీ సాధ్యం కాలేదు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి అధికారులు రవాణా సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

# అటు వర్షం..ఇటు చిమ్మ చీకటి..రాత్రంతా జాగారమే

**నర్సింహులపేట, మే 28 -నవభూమి:** అటు జోరుగా వర్షం కురియడంతో.. ఇటు కరెంటు పోయింది. దీంతో రాత్రంతా జాగారమే చేయవలసి వచ్చింది ఆ గ్రామ ప్రజలు. మూడు నెలల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా.. కరెంటు సమస్య పరిష్కరించకపోవడంతో ప్రజలు నానాయాతన పడుతున్నారు.నర్సింహులపేట మండలంలోని నరసింహపురం బంజర గ్రామపంచాయతీలో 150 గృహాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా 100 గృహాలకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు నోచుకోలేదు. కొన్ని నెలలు గడుస్తున్నా అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో మంగళవారం కురిసిన వర్షానికి ఆ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో అటు వర్షం, ఇటు చిమ్మ చీకట్లో గ్రామ ప్రజలు ఉండిపోవాల్సి వచ్చింది.వర్షం కారణంగా పాములు తేళ్లు బయటకు వచ్చే అవకాశం ఉందని, దాంతో బయటకు కూడా వెళ్లలేని పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం గ్రామస్తులు సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాలని మూడు నెలల క్రితం తొర్రూర్‌కి వెళ్లి ట్రాన్స్‌కో డీఈకి వినతి పత్రం ఇచ్చి మా బాధలను వివరించడం జరిగిందన్నారు. అయినా ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి చిమ్మ చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయాలని గ్రామ వాసులు కోరుతున్నారు.



## యుగపురుషుడు ఎన్టీఆర్



**జన్నారం-నవభూమి:** యుగపురుషుడు, కారణ జన్ముడు వంటి పదాలు చాలా బరువైనవి. అవి ఓ వ్యక్తికి అతికినట్లుగా సరిపోవడం స్వర్గీయ ఎన్టీఆర్ కు మాత్రమే చెల్లిందని తెలుగుదేశం పార్టీ జన్నారం మండల అధ్యక్షుడు ఉప్పుల విజయ్ పార్లమెంటు నియోజకవర్గ నాయకులు పులి శెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా జన్నారం మండల కేంద్రంలోని బస్టాండ్ ముందు తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేసి అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. సందర్భంగా వారు మాట్లాడుతూ.. నటుడిగా, రాజకీయ నాయకుడిగా అత్యంత విజయవంతమైన ప్రస్థానం ఆయనదన్నారు. ఒకానొక సమయంలో అభిమానులు ఆయన్ను దైవ స్వరూపుడిగా కొలిచారంటే అతిశయోక్తి కాదు. నటనలో శిఖరాల్ని అధిరోహించిన ఎన్టీఆర్, 9 నెలల్లోనే టీడీపి ని అధికారంలోకి తీసుకొచ్చి రాజకీయాల్లోనూ లెజెండ్గా నిలిచారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాల కోసం పార్టీ పెట్టి అహర్నిశలు వారి అభివృద్ధి కోసం కృషి చేసిన మహా నాయకుడు అన్నారు. అలాంటి మహానాయకుని స్మరించుకోవడం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, గొల్లపల్లి ప్రసాద్ పట్టణ అధ్యక్షులు ముత్యం పెల్లి నవీన్ ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి హరీష్ స్వరాజ్ నాయక్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ బిడ్‌లో భూవివాదంపై విచారణ



**ముధోల్-నవభూమి:** ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ గ్రామంలో శుక్రవారం రోజు భూవివాదం పై భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ అవినాష్ కూమార్ లు విచారణ జరిపారు. కొంతమంది తన భూమి ని ఆక్రమించి ఇండ్లు నిర్మించుకున్నారని బాధితుడు కొందపురం సాయాన్న ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ కు పిర్యాదు చేశారు. దీంతో భూ వివాదం పై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆర్డీవో, ఎఎస్పీ కీ కమీషన్ ఆదేశించింది. ఇందులో బాగంగా ఆర్డీవో, ఎఎస్పీ గ్రామానికి వెళ్ళి బాధితుడు,తో పాటు భూవివాదంలో సంబందం ఉన్న వారిని కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు.భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు లు ఇరువురు అందజేయాలని సూచించారు. వివాదం లో ఉన్న భూమికి కొలతలు నిర్వహించాలని మండల సర్వేయర్ ప్రవీణ్ ను ఆదేశించారు. దీంతో తహశీల్దార్ శ్రీలత ఆధ్వర్యంలో సర్వేయర్ తోపాటు, ఆర్ఐ లు నారాయణ రావు పటేల్, సరస్వతి, రెవెన్యూ సిబ్బంది భూమికి కొలతలు నిర్వహించె పనుల్లో నిమగ్నమయ్యారు. ఈకార్యక్రమంలో సిఐ మల్లేష్, ఎస్ఐ సంజీవ్, పంచాయతీ కార్యదర్శి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కవితల పోటీలు



**జన్నారం-నవభూమి:** జన్నారం మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కవితల పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవితల పోటీలను జూన్ రెండవ తేదీన మండల కేంద్రంలోని మేదరి వాడ హనుమాన్ టెంపుల్ దగ్గర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ కవితల పోటీలలో పాల్గొనాలన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 1116, రెండవ బహుమతిగా 516 మూడవ బహుమతిగా 316 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ కవితల పోటీలలో బీసీ రిజర్వేషన్ల ఆవశ్యకత చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు విద్య ఉద్యోగాలు ప్రమోషన్లు 50 శాతం రిజర్వేషన్లు, తదితర బీసీ అంశాలపై నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న కవులు కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలలో గెలుపొందాలని కోరారు.

## జన్నారం వైన్డింగ్ యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**జన్నారం-నవభూమి:** జన్నారం మండలం వైన్డింగ్ యూనియన్ కార్యవర్గాన్ని బుధవారం ఆ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులునవభూమిచారి అధ్యక్షులునవభూమి దండవేణి శ్రీధర్ ఉపాధ్యక్షులునవభూమి ఇంతియాజ్ , బోర్లాకుంట గంగన్న ప్రధాన కార్యదర్శినవభూమి కట్ల నాగరాజ్ కార్యదర్శినవభూమి గూడెపు పవన్ సలహాదరులునవభూమి మంతెన నరేష్, ముమ్మడి హరికృష్ణ , కాటుకం మల్లేష్ గొల్లపల్లి ప్రసాద్ ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు అందరూ కలిసి జన్నారంలో ఎన్నో సంవత్సరాలుగా రైతులకి సేవలందిస్తున్న గౌరవ అధ్యక్షులు చారిని సన్మానించారు.

## భారీ వర్షం.. అంబాల గ్రామంలో రాత్రిపూట ఇంట్లోకి వచ్చిన భారీ కొండచిలువ



**హన్మకొండ-నవభూమి:** కమలాపూర్ మండలం అంబాల గ్రామంలోని కేశవపూర్ రోడ్డు రామ్ లక్ష్మణ్ కాలనీలో ఒక భారీ కొండచిలువ ఇంట్లోకి దూరి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసింది. సుమారు రెండు మీటర్ల పొడవున్న ఈ కొండచిలువ.. మంగళవారం రాత్రి 9నవభూమి30 గంటలకు భారీ వర్షం కారణంగా రోడ్డుపై నుంచి ఇంట్లోకి వచ్చింది.వర్షాకాలం కాబట్టి సాధారణంగా విషపురుగులు తిరుగుతుంటాయని, అయితే ఇంత పెద్ద కొండచిలువ ఇంట్లోకి రావడం ప్రజలను భయాందోళనకు గురిచేసిందని స్థానికులు చెబుతున్నారు. కొండచిలువ సంచారం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అంబాల గ్రామ పెద్దలు సూచించారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై రైతుల ఆందోళన

**దంతాలపల్లి-నవభూమి:** కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే కొనే నాథుడు లేక కళ్లాల్లోని ధాన్యం నీటి పాలవుతున్నది. దంతాలపల్లి మండలంలోని కుమ్మరి కుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెలరోజుల క్రితం వచ్చిన ధాన్యాన్ని కూడా కాంటాలు పెట్టడం లేదని రైతులు ఆరోపించారు. అలాగే కాంటాలు పెట్టిన ధాన్యం బస్తాలు మిల్లులకో తరలించక పోవడంతో అకాల వర్షాలకు బస్తాలు తడిసి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో అధికారులు పట్టించుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ సూర్యాపేట -దంతాలపల్లి రహదారిపై వడ్ల బస్తాలు వేసి రైతులు ఆందోళన చేశారు. పోలీసులు ఆందోళన అడ్డుకోవాలని చూడగా రైతు యాకూబ్ కానిస్టేబుల్ కాళ్లు మొక్కి మా బాధను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు.



## ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి: మర్రి వెంకటరెడ్డి




**ఖిలావరంగల్, మే 28నవభూమి** ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపి వేయాలని ఎంసీపీఐ పొలిట్ బ్యూరో సభ్యులు మర్రి వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శివనగర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న ఎంసీపీఐ రాష్ట్ర ప్రథమ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో ఆదివాసీలపై రాజ్య హింసను కొనసాగిస్తుందన్నారు. మావోయిస్టుల ఏరివేతను చేపట్టినామని చెబుతూ భారత పౌరులను పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపి కనీసం ఆ శవాలను కూడా వారి కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.ఆపరేషన్ కగార్‌ను విరమించుకొని శాంతి చర్చలను జరిపి భారత పౌరుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అడవిలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలు దోచుకునేందుకు ఆదివాసులు అడ్డుగా ఉన్నారనే కుట్రతో చేస్తున్న ఆపరేషన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగానికి హామీ ఇచ్చిన పంటలకు గిట్టుబాటు ధరల చెల్లింపు చట్టం చేసి అమలు చేయడానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీ రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయకపోవడం, ఎకరాకు రూ.15 వేలు పంట పెట్టుబడి సహాయం పూర్తి స్థాయిలో అందించలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామీణ ప్రజలల్లో రోజు రోజుకు విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కాబట్టి పంచాయితీ ఎన్నికలకు వెళ్లితో ఓడగొడతారనే భయంతో ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ కేంద్ర నాయకులు మోర్తాల చందర్‌రావు, నర్ల చంద్రశేఖర్, పానుగంటి నర్సయ్య, మాదం తిరుపతి, మాడిశెట్టి అరుణ్‌కుమార్, తాటికొండ రవి, మాలోత్ రాజేష్‌నాయక్, సంద గణేష్, భాషిపాక రమేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేయాలి: డా.గజవెల్లి ఉషారాణి

**రాయపర్తి నవభూమి:** సంపూర్ణ ఆరోగ్యం కోసం సమాజంలోని ప్రతి ఒక్కరు నిత్యం యోగ సాధన చేయాలని ఆయూష్ మండల వైద్యాధికారిని డా. గజవెల్లి ఉషారాణి తెలిపారు. యోగా దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర ఆయూష్ విభాగం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగ మాసోత్సవాలలో బుధవారం గవర్నమెంట్ ఆయూష్ డిస్పెన్సరీ-సన్నూరు, రాయపర్తిల సారథ్యంలో మండల కేంద్రంలో హరితయోగ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా డా. గజవెల్లి ఉషారాణి, డా. కొండూరి రవికుమార్ సిబ్బంది, ప్రజలతో కలిసి ప్రభుత్వ స్థలాల్లో ఔషధ మొక్కలు నాటారు. అనంతరం ఉషారాణి మాట్లాడుతూ అనునిత్యం యోగా సాధన చేయడం వల్ల ప్రజలకు మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ప్రశాంతత చేకూరుతుందన్నారు.ఆయూష్ వైద్య సేవలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఆయూష్ డిపార్ట్‌మెంట్ నేతృత్వంలో ప్రజా అవగాహన సదస్సులు, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ శ్రీలక్ష్మి, యోగా శిక్షకులు విష్ణు, కల్పన, మహ్మద్ యాకూబ్ పాషా, అయిత యాకయ్య, ఆకారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

